క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఫాతిమా మెడికల్ కళాశాల కరస్పాండెంట్ ఏక్యూ జవ్వాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ కోరారు. వీరి ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె మండలం గంగమ్మ గుడి వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు వైద్య సేవలు అందించారు. పరిసర ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా కళాశాల మెడికల్ సిబ్బంది, వైద్య బృందం పాల్గొంది.

ప్లీనరి జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించుకోవడానికి జులై 24, 25 వ తేదీలలో కడప నగరంలో నిర్వహించనున్న పీఎస్‌యు జిల్లా ప్లీనరీ సమావేశం జయప్రదం చేయాలని పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ద్వారా గోపి పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను శుక్రవారం తమ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యం ఫీజుల దోపిడీని అరికట్టడంలో జిల్లా విద్యా శాఖ అధికారులు విఫలం చెందారన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, సురేంద్ర, సుధీర్ పాల్గొన్నారు.

22న పుస్తకావిష్కరణ

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ ఉర్దూ రచయితల సమైఖ్య ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం 10 గంటలకు కడప నగరంలోని సెవెన్ రోడ్స్ ద్వారకా టవర్స్ మూడవ అంతస్తులోని ఎయిమ్ అకాడమి కాన్ఫరెన్స్ హాలులో తాను రచించిన తెలుగు వ్యాసాల పుస్తకం 'ఉర్దూ హృదయంలో తెలుగు స్వరం' ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు సత్తార్ ఫైజీ తెలిపారు. రాష్ట్రంలోని 40 మంది ప్రముఖ ఉర్దూ విద్య, సాహితీవేత్తల సేవల గురించి తెలుగు వ్యాసాలు రచించానన్నారు. సభకు అధ్యక్షత ఉర్దూ వాలే సంస్థ స్థాపకుడు రిటైర్డ్ ప్రొఫెసర్ ఖాసీం అలి ఖాన్ వ్యవహరిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా పుస్తక సమీక్ష చేసేందుకు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ మూల మల్లికార్జున రెడ్డి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాష, గౌరవ అతిథులుగా తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఉర్దూ విభాగం అధ్యక్షులు ఆచార్య డాక్టర్ నిసార్ అహమద్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి హిదాయతుల్లా ప్రత్యేక అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఏపీజీ రిటైర్డ్ ఉద్యోగుల వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ శివశంకర్‌రెడ్డితోపాటు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు కోరారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ తనకు కొంత సమయం ఇస్తే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సీనియర్ ఉద్యోగులు అందించిన సేవల వల్లే నేడు గ్రామీణ బ్యాంకు వ్యాపారంలో మంచి వృద్ధి సాధించిందని, భవిష్యత్తులో బ్యాంకును మరింత ముందుకు తీసుకు వెళ్లాలని ఆయన కోరారు. అనంతరం చైర్మన్‌ను బ్యాంకు అధికారులు, విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జీఎం అరుణ్‌కుమార్, యూనియన్ నాయకులు రామచంద్రారెడ్డి, బొమ్మన వీరారెడ్డి, శైలేంద్రనాథ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో సమస్యల తిష్ట

- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలక ప్రభుత్వాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివార్లలోని 17వ డివిజన్‌లోని ఇందిరానగర్ సమస్యల నగర్‌గా మారింది. ఇందిరానగర్ ఏర్పడి సంవత్సరాలు కావస్తున్నా కనీస సౌకర్యాలకు నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ఇందిరానగర్‌లోని వీధుల్లో సిమెంట్ రోడ్లు నిర్మించకపోవడంతో ప్రజలు వర్షాకాల సమయంలో నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో సక్రమంగా మురికి కాల్వలు లేకపోవడంతో ఎక్కడి మురికి నీరు అక్కడ నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నది. ఇండ్లలోని చెత్త చెదారం రోడ్డు పక్కన దిబ్బలుగా వేయడంతో ప్రజలు దుర్వాసనతో అల్లాడుతున్నారు. ఇందిరానగర్ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా ఎటువంటి ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి ఇందిరానగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



నగరంలోని 17వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో నెలకొన్న సమస్యలను పాలక ప్రభుత్వాలు పరిష్కరించాలి. వీధుల్లో సిమెంట్ రోడ్డు నిర్మించి మురికి కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి. రోడ్లపై ఉన్న చెత్తచెదారాన్ని తొలగించి ఈ ప్రాంత సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. – మడగలం ప్రసాద్, ఆర్‌సీపీ నాయకుడు, ఇందిరానగర్



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త చెదారం (ఇన్‌సెట్) అధ్వాన్నంగా ఉన్న మురికి కాల్వలు

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పని చేస్తున్న టైపిస్టును అవమానిస్తూ వీడియోలు తీయించి మానసికంగా కులం పేరుతో వేధించిన ప్రిన్సిపల్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘ నాయకులు సుబ్బరాయుడు, జయవర్ధన్ డిమాండ్ చేశారు. కడప నగరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రిన్సిపల్ స్థాయి ఒక అధికారి తమ ఆఫీసులో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది దళిత యువకున్ని వివాహం చేసుకున్నందన్న నెపంతో వితంతు మహిళా ఉద్యోగిని అవమానించడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ నగిలి రాజేంద్రప్రసాద్, గోపి, ఓబయ్య లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలేవీ..?



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని కేశవరెడ్డి విద్యాసంస్థలు ఒకే క్యాంపస్‌లో ఎటువంటి పర్మిషన్లు లేకుండా అమ్మాయిల, అబ్బాయిల హాస్టళ్లు నడపడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు కత్తి, తెలుగు రాష్ట్ర విద్యార్థి సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజు, నేషనల్ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడారు. జిల్లాలో చాలా ప్రైవేటు, కార్పోరేట్ స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా డబ్బే ధ్యేయంగా అధిక ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. దీంతోపాటు పాఠశాలల్లోనే దుకాణాలను తెరిచి పుస్తకాలను విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌వైఎఫ్, టీఆర్ఎస్ఎఫ్, ఎన్‌డీఎస్ఎఫ్ నాయకులు బయన్న, ప్రవీణ్, కన్నా, చిన్న, నాయుడు పాల్గొన్నారు.

గంజాయి నిరోధానికి సమష్టి కృషి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గంజాయి రవాణాను నిరోధించడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకమని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డీకే జావీద్ పేర్కొన్నారు. శుక్రవారం కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో 'ఈగల్'(ఎలైట్ యాంటి–నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత సీఐ ఆర్టీసీ అధికారులతో కలిసి గంజాయి నిరోధంపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ జావీద్ మాట్లాడుతూ గంజాయి రవాణా గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1072 కు అందచేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారన్నారు. ఆర్టీసీ డి.ఎం ఢిల్లేశ్వర రావు మాట్లాడుతూ సమాజంలో గంజాయి మహమ్మారిని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో 'ఈగల్' ఏ.ఎస్.ఐ మల్లయ్య, ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐ, ఆర్టీసీ అధికారులు

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల, కార్మికులకు పని చేసే సమయం 10 గంటలకు పెంచడం తగదని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎల్ నాగసుబ్బారెడ్డి, బి.మనోహర్ విమర్శించారు. శుక్రవారం స్థానిక కడప సబ్ కలెక్టర్ (ఆర్డీఓ)కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులు ఇకనుంచి 10 గంటలపాటు పని చేయాలని క్యాబినెట్ తీర్మానం చేయడాన్ని బ్రిటిష్ పరిపాలనను తలపిస్తోందని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మిక సంఘాలతో ఆ అంశాల పట్ల చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు సరైనవి కాదని తప్పుపట్టారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికుల పోరాటాల ఫలితంగానే 8 గంటల పని విధానం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. 8 గంటల పని విధానం అనేది శాస్త్రీయమైన ఆలోచన విధానమని, ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. రోజుకి 24 గంటల్లో 8 గంటల పని, 8 గంటల కుటుంబ సేవలు, 8 గంటల నిద్ర అనేది ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించిన విజ యమని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కే.సి.బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, నగర అధ్యక్షులు సుబ్బరాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లింగన్న, సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, మున్సిపల్ వర్క ర్ యూనియన్ నాయకులు సుంకర రవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కడప ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కడప ఎడ్యుకేషన్: నీటి సంరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ‹నీరు–మీర్జు›పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నీటిని పొదుపుగా వాడితే భవిష్యత్తు తరాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవడంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ నీటి వృధా చేయకూడదని సూచించారు. వృక్షశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నీటి వనరులను కాపాడుకోవడం, పరిశుభ్రమైన నీటిని ఉపయోగించడం పర్యావరణానికి, ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం అన్నారు. ఈ అవగాహన సదస్సులో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అంకాల నాగరాజు, రమేష్ యాదవ్, శివరామకృష్ణ తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్

నేడు యోగాంధ్రకు సర్వం సిద్ధం



విద్యార్థినులు చేస్తున్న డెమో యోగాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌస్ బాషా

కమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈనెల 21న అన్ని మండలాల్లో, గ్రామాల్లో యోగాంధ్ర విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఎంపీడీఓ గౌస్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బాలయోగి గురుకుల పాఠశాలలో యోగాంధ్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. శుక్రవారం గురుకులం విద్యార్థినులతో డెమో యోగా కూడా నిర్వహించారు. అలాగే యోగాంధ్రను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయాల సిబ్బంది హాజరు కావాలని ఇప్పటికే ఎంపీడీఓ పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

యోగా చేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం



యోగాసనాల ప్రాధాన్యతను తెలియజేస్తున్న ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్‌రాజ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : యోగాతో ఆరోగ్యం పదిలమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని శారద విద్యా సమాజం ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు బీవీ వరప్రసాద్‌రాజ్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా బీవీ వరప్రసాద్‌రాజ్ మాట్లాడు తూ శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోడీ విశాఖపట్టణంలో నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. యోగాసనాలు అభ్యసించడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా గడపవచ్చన్నారు.

పరామర్శ

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయ కుడు గంగిరెడ్డి ఆయన సతీమణి శుక్రవారం ఉదయం జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ప్రొద్దుటూరులోని ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. మండల ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న కెనరా బ్యాంకు జీఎం అరుణజ్యోతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు రీజినల్ హెడ్ అరుణజ్యోతి తెలిపారు. శుక్రవారం ఏడురోడ్ల కూడలిలో ప్రజలకు బ్యాంకు అందిస్తున్న సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రమైన, సౌకర్యవంతమైన బ్యాంకింగ్ పద్ధతులను ప్రవేశపెట్టామని, ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్లు రమేష్, విలియం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు సమావేశం

కడప రూరల్: ఈ నెల 22వ తేదీన ఏపీ నూర్ బాష ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశంను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు పగడాల సిద్దయ్య తెలిపారు. కడప నగరంలోని శంకరాపురం అంధుల పాఠశాల వద్ద గల మస్తాన్ కోచింగ్ సెంటర్‌లో సమావేశంను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు పరచాలి

కడప ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పటిష్టంగా అములు చేయాలని ప్రోగ్రెస్ స్టూడెంట్ ఫెడరేషన్ (పి ఎస్ ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరంలోని ప్రోగ్రెస్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫీస్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు తల్లిదండ్రులపై బుక్స్ ,నోట్ బుక్స్ కొనుగోలుకు బలవంతంగా ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఎమ్మార్పీ రేటు కంటే అధిక ధరలకు పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్నారన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. నిబంధనలను పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అశోక్, కుమార్, భార్గవ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప డిపోలో ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యలను పరిష్కరిస్తామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం సాయంత్రం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణీకులు తమ సమస్యలను డీఎం దృష్టికి తీసుకు వచ్చారు.

- కడప నుంచి చిత్తూరుకు ఉదయం 5.00 గంటలకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే విజయవాడకు కడప నుంచి ఉదయం 6.00కు బదులుగా 5.30 గంటలకు సమయాన్ని మార్చాలని కోరారు.
- దేవునికడప నుంచి కేంద్రీయ విద్యాలయకు బస్సు నడపాలని కోరారు. అలాగే వల్లూరు నుంచికూడా కేంద్రీయ విద్యాలయకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఈ సందర్భంగా డీఎం తమ పరిధిలోని సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మా పరిధిలోని లేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని వివరించారు.

యోగాతో మానసిక ఉల్లాసం

కడప ఎడ్యుకేషన్: యోగాతో ఆరోగ్యం లభిస్తుందని స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ అన్నారు. కడప నగరంలోని ట్రంక్ రోడ్‌లోని మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ మాట్లాడుతూ యోగ అనేది ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా యోగ టీచర్, మైండ్ సెట్ అండ్ మానిఫెస్టేషన్ కోచ్ ప్రణవి సుదర్శన్‌ను మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రచయిత కూచిపూడి నాట్యం అంతర్జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ కె సుమన శ్రీ, పాల్గొన్నారు.